క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఎటపాక: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి కోరారు. మండలంలోని గుండాల, పురుషోత్తపట్టణం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని చెప్పారు. తుపానుల కారణంగా సమీపల్లోని విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దని హెచ్చరించారు. అనారోగ్యమైతే వెంటనే ఆస్పత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు.

సేంద్రియ సాగుపై అవగాహన


రైతులకు సూచనలిస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: మండలంలో రేవళ్లలో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి బుధవారం పర్యటించారు. గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించుకోవాలన్నారు. సేంద్రియ సాగు వల్ల భూసారం బాగుంటుందని, రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. దిగుబడులు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. 14 వారాల పాటు ప్రత్యేక పొలంబడి కొనసాగుతుందన్నారు. వరి పంట వేసిన ప్రతీరైతు కూడా విధిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్ నమోదుతో కలిగే లాభాలను ఆమె రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సతీష్, రూప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నరేంద్ర

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం సుమారు 150 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ దినేష్, హెచ్‌ఎం అప్పలనాయుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలపై ప్రచారం


ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

అడ్డతీగల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 అడ్మిషన్‌ల వారోత్సవాల ప్రక్రియలో భాగంగా అడ్మిషన్‌లు పెంచడానికి ఓపెన్ స్కూళ్లు, స్టడీ సెంటర్ల నిర్వాహకులు బుధవారం పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ మేరకు అడ్డతీగలలోని మండల విద్యావనరుల కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గ్రామ సచివాలయాలు, స్వయం సహాయక కేంద్రం భవనం చోట్ల పోస్టర్‌లను అతికించారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్లు పెంచేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం వినతి

గంగవరం: రిటైర్మెంట్ గ్రాడ్యుయిటీ భవిష్య నిధులు తదితర బెనిఫిట్స్ మంజూరు చేసి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా సహకార సంఘం ఉన్నతాధికారులకు మొల్లేరు సొసైటీ మాజీ సీఈవో బి.జయరాజ్ బుధవారం వినతిపత్రాలు పంపించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొల్లేరు సొసైటీ వసూళ్లపై తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమన్నారు. తనకు 2019 నుంచి ఏరియర్స్ రావల్సి ఉందని, ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేయాలని కోరారు.

బిక్కు బిక్కుమంటూ విధులు

- వర్షానికి కారిపోతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం
- రికార్డుల భద్రతకు ఇక్కట్లు
- అసంపూర్తిగా నూతన భవనం
- సిబ్బంది అవస్థలు
- పట్టించుకోని అధికారులు


భవనం పైకప్పు నుంచి కారుతున్న వర్షపునీరు


కారుతున్న భవనంలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది


అసంపూర్తిగా ఉన్న ఉపాధి కార్యాలయ భవనం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక కల్యాణ మండపంలోని ఓ గదిలో నిర్వహిస్తున్న ఎస్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. భవనం గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. భవనం పైకప్పు దెబ్బతింది. చిన్నపాటి వర్షం కురిసినా గదులన్నీ జలమయమవుతున్నాయి. కురుస్తున్న వర్షాలకు కారిపోతుంది.దీంతో సిబ్బంది అవస్థలు పడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు గదిలో నిల్వ ఉండిపోవడంతో బయటకు తోడడం ప్రతి రోజు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి ఒక పనిలా మారిపోయింది. భవనం పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతూ ఉండడంతో కొన్నిసార్లు గొడుగులు పట్టుకొని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. కార్యాలయంలో ఉన్న ఉపాధి పనులకు సంబంధించిన మస్తర్లు, రికార్డులు, ఆడిట్ పుస్తకాలు భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో ఒకే గది ఉండడంతో కంప్యూటర్లు, బీరువాలు, సామగ్రి, ఫర్నీచర్లు ఉండడంతో ఇరుకుగా ఉన్న చోటనే అన్ని రకాల పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా సమావేశాలు జరిగేటప్పుడు కొంతమంది కూర్చుంటే మరికొంత మంది నిల్చునే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనే విధులు నిర్వహిస్తున్నారు.

అసంపూర్తిగా నూతన భవనం

మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం నూతన భవనం అసంపూర్తిగా దర్శనం ఇస్తుంది. 2008 సంవత్సరంలో వెలుగు, ఎస్‌ఆర్ ఈజీఎస్ కార్యాలయాలు ఒకేచోట ఉండే విధంగా రూ. 20లక్షలతో భవనాలు మంజూరు చేశారు. వెలుగు కార్యాలయంలో నిర్వహణ జరుగుతున్నా, ఉపాధి కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. 80శాతం వరకు భవన పనులు జరిగినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో భవనం అసంపూర్తిగా వదిలేశారు.దీంతో ఎస్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం నిర్వహణకు అధికారులు, సిబ్బంది కష్టాలు పడుతున్నారు.గతంలో పలుమార్లు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా సమస్య తీరలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పడుతున్న అవస్థలు గుర్తించి, అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఉపాధి కార్యాలయం కారిపోతున్న విషయాన్ని ఇప్పటికే సిబ్బంది నా దృష్టికి తీసుకువచ్చారు.గతంలో నిర్మించిన భవనం అసంపూర్తిగా ఉండడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. భవన నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం ఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నిధులు మంజూరైన వెంటనే అసంపూర్తి భవనం పూర్తి చేస్తాం.

– కె.కిరణ్‌కుమార్, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

సిబ్బంది కష్టాలు వర్ణనాతీతం



ఉపాధి కార్యాలయం శిథిలావస్థలో ఉంది. వర్షం పడితే భవనం అంతా కారిపోతుంది. రికార్డులు, ఇతరత్రా సామగ్రి తడిసిపోతోంది. ఇరుకైన గదిలో ఇబ్బందులు పడుతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం సిబ్బందిని వెంటాడుతుంది. సిబ్బంది పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

– రాజు, గ్రామస్తుడు, ముంచంగిపుట్టు

హక్కులు, చట్టాల పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గిరిజన చట్టాలు, హక్కులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థ సమత కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యాంగం హక్కులు, చట్టాలు కల్పించిందని, అవగాహన లేక ప్రతిఫలం పొందలేకపోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పోక్సో, పీసా తదితర చట్టాలను తెలుసుకోవాలన్నారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. సంస్థ ప్రతినిధులు లక్ష్మీ, రాధ, సైమన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి అటవీ రేంజర్‌గా అప్పారావు



చింతపల్లి: చింతపల్లి అటవీశాఖ రేంజ్ అధికారిగా అప్పారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ చింతపల్లి ఇన్‌చార్జి రేంజ్ అధికారిగా లోతుగెడ్డ రేంజ్ అధికారి పాత్రుడు పనిచేశారు. ఈయన స్థానంలో సోషల్ ఫారెస్ట్రీ విభాగంలో పనిచేస్తున్న అప్పారావును చింతపల్లిలో రేంజ్ అధికారిగా నియమించారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ప్రజాప్రతినిధులు



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అరకు ఎంపీ తనూజారాణి, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీపీలు ఈశ్వరి, అనూషాదేవి, మాజీ ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు తదితరులు

చింతపల్లి/డుంబ్రిగుడ: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మన్యంలోని ప్రజాప్రతినిధులంతా బుధవారం విజయవాడ వెళ్లారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, డుంబ్రిగుడ, చింతపల్లి ఎంపీపీలు ఈశ్వరి, అనూషాదేవి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్యంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం, ఎమ్మెల్సీ ఎన్నికలపై జగన్‌మోహన్‌రెడ్డి చర్చించినట్టు పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సూచనలు ఇచ్చారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో డుంబ్రిగుడ జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులున్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిఅబ్బాయి


అరకులోయలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు


అరకులోయలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

పాడేరు రూరల్ (హుకుంపేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వనం చిట్టి అబ్బాయి హాజరై మాట్లాడుతూ యువత చేనేత వస్త్రాలను ధరించడం వలన దేశ సంస్కృత సాంప్రదాయలకు కట్టుబడినట్టు ఉంటుందన్నారు. చేనేత రంగం మన దేశ సుసంపన్నమైన, వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా ఉందని కొనియాడారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో దామోదర్, అధ్యాపకులు గౌరీశంకర్, గణేష్, సౌమ్య, జానకిరామ్, అప్పలనాయుడు, దిలీప్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల్లో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్ నాయక్, రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందితేనే ఆర్థికంగా బలోపేతం, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. భారతదేశ సుసంపన్నమైన చేనేత రంగానికి ఆదరణ పెంచి, పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. యువత చేనేత వస్త్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావు, అధ్యాపకులు బాలరాజు, ధర్మారావు తదితరులు , నాగబాబు,విజయలక్ష్మి,అనితకుమారి,కొండబాబు,గణేష్,లచ్చన్న,తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంతో ప్రమాదాల నివారణ


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

రంపచోడవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు హెల్మెట్ వాడకంపై పోలీస్‌శాఖ సహకారంతో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్‌ఐ మోహన్, పోలీసు సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రవికుమార్ తదితరులు హెల్మెట్‌లు ధరించి బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మోహన్ మాట్లాడుతూ హెల్మెట్ వాడడం వలన ప్రమాదాల జరిగినపుడు వాహనచోదకులకు రక్షణ ఉంటుందన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో తాగునీటి సమస్య

- విద్యార్థులకు తప్పని అవస్థలు


ఏకలవ్య పాఠశాల సమీపంలో ఉన్న తాగునీటి ట్యాంకు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. ఈ పాఠశాలలో సుమారు 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సక్రమంగా సరిపడేంత నీరు సరఫరా కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలో వాటర్ ట్యాంకు ఉన్నా నీరు సరఫరా సక్రమంగా జరగడం లేదంటున్నారు. కాలకృత్యాలు, స్నానాలకు నీరు సరిపడక నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం


గడుతూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


రాజవొమ్మంగిలో అంగన్‌వాడీ కార్యకర్తల మానవహారం


ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీ

జి.మాడుగుల/రాజవొమ్మంగి/ముంచంగిపుట్టు : జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీవోలు తదితరులు మాట్లాడుతూ తల్లిపాల వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలే బిడ్డకు అమృతమన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సీడీపీవోలు సువర్ణమ్మ, దేవమణి, సూపర్‌వైజర్ అరుణలత తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం

మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ



గూడెంకొత్తవీధి: ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకున్న కూలీలకు వేతనాలు ఇప్పటి వరకూ వారి బ్యాంకు ఖాతాల్లో జమకాలేదని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేతనాలను మంజూరు చేసినప్పటికీ నేటికీ వారి ఖాతాల్లో నిధులు జమకాలేదన్నారు. దీనివల్ల వారంతా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో సక్రమంగా ఉపాధి కూలీలకు వేతనాలు, రైతులందరికీ రైతు భరోసా నిధులు, అమ్మఒడి నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవన్నారు. దీనివల్ల వారికి ఎటువంటి ఇబ్బందులూ ఉండేవి కాదని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలందరూ అన్ని విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 50 రోజులు పైబడినా నేటి వరకు ఒక్క పథకం అమలుకాకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తల్లికి వందనం, రైతు భరోసా, ఉపాధి కూలీల నిధులను తక్షణమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

డీఎస్సీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి


మొశ్య రంజిత్‌కుమార్

అరకులోయ రూరల్: డిఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మొశ్య రంజిత్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు చదువుకున్న యువత ప్రతి ఒక్కరికి నిరుద్యోగభృతి ఇస్తానని, డీఎస్సీతో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలో వచ్చిన తరువాత నేటికి వాటి ఊసేలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాలుగా మోసపూరిత హామీలు ఇచ్చి అనివర్గాల ప్రజలకు మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజలు భయభ్రాంతులకు గురి చేసే విధంగా కక్ష రాజకీయలకు తెరలేపారన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడంతో ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తారనే కక్షతోనే అరాచక పాలన సాగిస్తున్నరన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని లేని పక్షంలో ప్రజా వ్యతిరేఖతకు గురికాక తప్పదన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

పాఠశాలలకు ఉపాధ్యాయుడు మొక్కల వితరణ


పాఠశాలలకు మొక్కలు అందజేసిన హెచ్‌ఎం

జి.మాడుగుల: చింతపల్లి మండలం లోతుగెడ్డ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు శోభ నారాయణ సొంత సొమ్ము ఖర్చు చేసి మొక్కలను కొనుగోలు చేసి బుధవారం జి.మాడుగుల మండలంలో పలు ఆశ్రమోన్నత పాఠశాలలకు వితరణగా అందజేశారు. పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా జి.మాడుగుల మండలంలో కొక్కిరాపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డి.రాంబాబుకు 80మొక్కలు, గాంధీనగరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం పి.సుభద్రమ్మకు 40మొక్కలు, బొయితిలి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.అప్పలకొండకు 80మొక్కలు చొప్పున ఆయా ఆశ్రమ పాఠశాల ఆవరణలో నాటేందుకు దాత నారాయణ అందజేశారు. ఈ మేరకు సుమారు రూ.25వేల ఖర్చుచేసినట్టు నారాయణ చెప్పారు.

మొక్కలు అందించిన ఉపాధ్యాయుడు నారాయణను హెచ్‌ఎంలు అభినందనలు తెలియజేశారు. లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాతలో 2015 సంవత్సరంలో తన సొంత ఖర్చుతో డిజిటల్ గది ఏర్పాటు ,2016సంవత్సరంలో కిముడుపల్లి ఆశ్రమ పాఠశాలకు మొక్కలు అందించారు. 2022లో లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాలకు రూ.30వేలతో మొక్కలు నాటినట్టు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, చిత్రంలో జెడ్పీటీసీ బేబీరత్నం తదితరులు

గంగవరం : గ్రామాల్లో నెలకొన్ని ఉన్న సమస్యలు పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం అన్నారు. ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలపై ఎంపీపీ కృష్ణారెడ్డి సమీక్ష నిర్వహించారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చూడాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో బి.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నివారణ, విద్యుత్ సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. వైస్ ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మి , కనకలక్ష్మి, పండా ఆదినారాయణ, సర్పంచ్‌లు అక్కమ్మ, రామలక్ష్మి, శివ, రమణమ్మ, తమ్మన్నదొర గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైద్యాధికారి భావన, ఎంఈవో మల్లేశ్వరరావు, ఏపీఓ ప్రకాశ్, ఏవో విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.